సాక్షి
అన్నమయ్య జిల్లా
ఆదివారం । 26 । మార్చి । 2023



రోజ్ దారో ఉఠో.. సహరీ కర్లో..
రంజాన్ నెల ప్రారంభమవ్వగానే..ఉపవాస దీక్షకు ముస్లింలను మేల్కొలిపి సిద్ధం చేయడం ఫకీర్లకు ఆనవాయితీగా వస్తోంది. -8లో..



పశుసంవర్ధక శాఖ డీడీ అచ్చెన్న మృతిపై వీడని మిస్టరీ
పశుసంవర్ధక శాఖలో డీడీగా పనిచేస్తూ గువ్వల చెరువు వద్ద శవమై తేలిన అచ్చెన్న సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.90	రూ.120
రెండోరకం	రూ.56	రూ.88

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 199 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	435	560
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 697.94 కిలోలు

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆది (సా॥)	సహర్ సోమ (ఉ॥)
రాజంపేట	6.31	4.58
రాయచోటి	6.31	4.55
మదనపల్లి	6.32	4.56
పీలేరు	6.28	4.51

అతివల ఆర్థికాభివృద్ధికి ఆసరా

- వైఎస్సార్‌ఆసరా మూడో విడత నిధులు విడుదల
- డీఆర్‌డీఏ, మెప్మా పరిధిలో 24,915 డ్వాక్రా సంఘాలకు రూ. 223.56 కోట్లు జమ
- జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా



లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డిలు

సాక్షి రాయచోటి : అన్నమయ్య జిల్లాలోని డీఆర్‌డీఏ, మెప్మా పరిధిలోని 24,915 డ్వాక్రా సంఘాలకు వైఎస్సార్ ఆసరా పథకం కింద మూడో విడత రూ. 223.56 కోట్లు జమ చేశామని జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. శనివారం ఏలూరు జిల్లా దెందులూరు నుంచి వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత రుణమాఫీ స్వయం సహాయక సంఘాల సభ్యుల ఖాతాల్లో జమ చేసే బృహత్తర కార్యక్రమాన్ని లాంఛనంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్ స్పందన హాలులో ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంలో జేసీ తమీమ్ అన్సారియా, ఉమ్మడి జిల్లాల జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, ఎల్‌డీఎం వెంకటేశ్వరరెడ్డి, డీఆర్‌డీఏ, మెప్మా సిబ్బంది, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

- అనంతరం జేసీ, జెడ్పీ చైర్మన్, డీఆర్‌డీఏ పీడీ తదితరుల చేతుల మీదుగా లబ్ధిదారులకు రూ. 223.56 కోట్ల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా జేసీ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా పథకం మూడవ విడతకు సంబంధించి అన్నమయ్య జిల్లాలో డీఆర్‌డీఏ, పట్టణ ప్రాంతాల్లోని మెప్మాలో జిల్లా మొత్తం 24,915 సంఘాలకు చెందిన 2,33,293 మంది మహిళల ఖాతాల్లో రూ. 223.56 కోట్లు జమ చేశామన్నారు. ఇందులో వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడతకు సంబంధించి డీఆర్‌డీఏ నుంచి 22,214 స్వయం సంఘాల్లోని 2,08,174 మంది సభ్యులకు రూ. 198.515 కోట్లు, పట్టణ ప్రాంతాల్లోని మెప్మా పరిధిలో ఉన్న 2701 సంఘాల్లోని 25,119 మంది మహిళలకు రూ. 24.49 కోట్లు జమ చేశామన్నారు. ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సహాయాన్ని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట: జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, మహిళల ఆర్థిక స్వావలంబన కోసం అనేక సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. ప్రతి మహిళ స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందడుగు వేస్తోందన్నారు. జగనన్న తన పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు 3వ విడత సొమ్ము పొదుపు సంఘాల మహిళల ఖాతాలలో జమ చేయడంతో మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు. అమూల్ వంటి గొప్ప సంస్థలో ఒప్పందం కుదుర్చుకుని పాల ఉత్పత్తులను పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ విధంగా హామీలు నెరవేర్చిమహిళల ఆర్థికాభివృద్ధికి చర్యలు చేపట్టడం దేశ చరిత్రలోనే జగనన్న రికార్డు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, ఎల్‌డీఎం వెంకటేశ్వరరెడ్డి, డీపీఎం లక్ష్మిప్రసాద్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మైథిలి, రాయచోటి ఇన్‌ఛార్జి ఎంపీడీఓ, డీఆర్‌డీఏ, మెప్మా సిబ్బంది, పొదుపు సంఘాల మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి మహిళల పాలిట దేవుడు



నేను అన్నమయ్య జిల్లా మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలిగా ఉన్నాను. బ్యాంకులో పొదుపు సంఘం తరుపున రుణం తీసుకున్నాం. మా సంఘానికి రుణమాఫీ వర్తించింది. మూడో విడత కింద మా సంఘానికి ప్రభుత్వం డబ్బులు జమ చేసింది. ఇది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని నిరూపితమైంది. ఇచ్చిన మాట ప్రకారం నెరవేరుస్తున్న మా ముఖ్యమంత్రి మహిళల పాలిట దేవుడు.
– కె.మైథిలి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు, రాయచోటి

ఇది చేతల ప్రభుత్వం



నేను పొదుపు సంఘంలోచేరి బ్యాంకు నుంచి రుణం తీసుకున్నాను. ఎన్నికలలో జగనన్న ఇచ్చిన మాట ప్రకారం ఆసరా డబ్బులను జమ చేశారు. ఇది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని నిరూపించారు. ఇచ్చిన మాట ప్రకారం నెరవేర్చుతున్న మా ముఖ్యమంత్రికి మహిళలు రుణపడి ఉంటారు.
– జి.అనూరాధ, రాయచోటి

ఆర్థిక పురోగతికి పెద్దపీట



ప్రభుత్వం తరుపున నేను బ్యాంకు లింకేజీ ద్వారా మా గ్రూపు సభ్యులతో కలిసి రుణం తీసుకున్నాను. ఈ రోజు జగనన్న ఆసరా పథకం కింద మా ఖాతాలలో డబ్బులు జమ చేశారు. ఈ ప్రభుత్వంలో చాలా రకాలుగా మా కుటుంబానికి ఆర్థిక సహాయం అందింది. మహిళల సంక్షేమానికి, ఆర్థిక పురోగతికి పెద్దపీట వేస్తున్న జగనన్న మేలు మరిచిపోలేం.
– జి.హసీనా, మాసాపేట, రాయచోటి

సీఆర్‌పీఎఫ్ కేంద్రంలో అభివృద్ధి పనులు ప్రారంభం


క్వార్టర్ గార్డ్, ఆసుపత్రి భవనాలను ప్రారంభిస్తున్న ఐజీ అజయ్ భరతన్

కలికిరి: అన్నమయ్య జిల్లా కలికిరి సమీపంలోని పాశెం వద్దనున్న సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) సీఐఏటీ-3 కేంద్రం ఆవరణలో రూ.11.20కోట్లతో నిర్మాణాలు పూర్తి చేసుకున్న క్వార్టర్ గార్డ్, 10 పడకల ఆసుపత్రి భవనాలను సీఆర్‌సీఎఫ్ ఐజీ అజయ్ భరతన్ చేతుల మీదుగా ప్రారంభించారు. శనివారం ఉదయం ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా వర్చువల్ విధానంలో ప్రారంభించిన అనంతరం ఐజీ నూతన భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ కలికిరి సీఆర్‌పీఎఫ్ కేంద్రం 468 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైందన్నారు. అధికారులు, జవాన్‌లు, కుటుంబ సభ్యుల వైద్య సదుపాయాలకు గాను రూ.6 కోట్లతో అత్యాధునిక వైద్య సదుపాయాలతో కూడిన 10 పడకల ఆసుపత్రి, రూ.5.20 కోట్లతో క్వార్టర్ గార్డ్ అనతికాలంలోనే అందుబాటులోకి రావడం హర్షణీయమన్నారు.కార్యక్రమంలో కమాండెంట్ రాజేష్ కుమార్, సీపీడబ్ల్యూడీ ఎగ్జిక్యూటివ్ అధికారి శ్రీనివాసులు రెడ్డి, సెకెండ్ ఇన్ కమాండెంట్ కేసీ నిర్మల్, జేఎన్టీయూ ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ, సైనిక పాఠశాల వైద్యాధికారిణి హిమబిందు, సర్పంచ్ ప్రతాప్ రెడ్డి, డిప్యూటీ కమాండెంట్‌లు ఏకే సింగ్, కదం సింగ్, శివప్రసాద్, అసిస్టెంట్ కమాండెంట్‌లు రవికుమార్, హనుమాన్ రామ్, గిరిధర్, డాక్టర్ శశికాంత్, జవాన్‌లు, కుటుంబ సభ్యులు, ఐటీబీపీ, బీఎస్‌ఎఫ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

1185 మంది గైర్హాజరు

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లావ్యాప్తంగా శనివారం నిర్వహించిన ఇంటర్ ప్రథమ సంవత్సరం భౌతికశాస్త్రం, ఆర్థికశాస్త్రం, ఒకేషనల్ పరీక్షకు సంబంధించి 1185 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 92 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షకు 25,632 మందికిగాను 24,447 మంది హాజరయ్యారు. వైఎస్సార్ జిల్లా కడపలోని ఓ పరీక్షా కేంద్రంలో ఆర్‌ఐవో రమణరాజు ఒకరిని, వెంపల్లెలో ఫ్లయింగ్ స్క్వాడ్ ఒకరిని డీబార్ చేశారు. జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు ప్రకాష్, వెంకటసుబ్బయ్య, ప్రసాద్‌వర్మ జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

ఉపాధి కూలీల కనీస వేతనం పెంపు



రాయచోటి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి కూలీల కనీస వేతనాన్ని మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ కేంద్ర ప్రభుత్వం పెంచిందని డ్వామా పీడీ చిన్న మద్దిలేటి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెంచిన కనీస వేతనం ఏప్రిల్ 1 నుంచి అమలులోకి రానుందని చెప్పారు. ప్రస్తుతం ఉపాధి హామి కూలీల కనీస వేతనం రూ. 257 ఉండగా, రూ.15 పెరగడంతో రూ. 272కు చేరిందన్నారు.

రుణాల కోసం ఎస్సీలు దరఖాస్తు చేసుకోవాలి

కడప రూరల్ : జిల్లాలోని వైఎస్సార్ షెడ్యూల్ కులాల సేవా సహకార సంఘం లిమిటెడ్ కడప ద్వారా 2022-23 సంవత్సరానికి షెడ్యూల్ కులాల వారికి పలు పథకాలకుగాను దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అమృత్ జలధార స్కీమ్ (ఏజేఎస్) పథకం ద్వారా బోరుబావి, బోరు మోటారు, డ్రిప్, స్ప్రింక్లర్లు తదితరాల యూనిట్ విలువపై 50 శాతం సబ్సిడీ 50 వేల వరకు మంజూరు చేస్తారన్నారు. మిగిలినది బ్యాంకు రుణమని తెలిపారు. దరఖాస్తు దారుడు 2.50 ఎకరాల భూమి కలిగి ఉండాలని, ఒకరు లేదా గ్రూపుగా ఉండవచ్చన్నారు. దరఖాస్తు దారునికి సంవత్సరాదాయం రూ. 3 లక్షలకు మించి ఉండరాదన్నారు.

ఎస్సీ శ్మశాన వాటికలకు
వేగంగా భూమి గుర్తించాలి

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా

రాయచోటి: జిల్లాలో అవసరమైన చోట్ల ఎస్సీ శ్మశాన వాటికలకు భూమి గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. శనివార ంసాయంత్రం విజయవాడ నుంచి ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి ముత్యాలరాజు వీడియో కాన్ఫరెన్సు అన్నమయ్య జిల్లా కలెక్టర్ జిల్లాలోని ఆర్డీఓలు, తహశీల్దార్లతో సమీక్షించారు. జిల్లాలో అసైన్మెంట్ వ్యవసాయ భూముల వివరాలు, చుక్కల భూముల వివరాలు గుర్తింపు తదితర అంశాలపై సమీక్షించారు. అసైన్మెంట్ భూముల గుర్తింపులో నివేదికలను పక్కాగా రూపొందించాలన్నారు. గుర్తించిన భూముల వివరాలను తర్వాత పబ్లికేషన్ జారీ చేయాలన్నారు. అన్నిచోట్ల నిబంధనల ప్రకారం అసైన్మెంట్ కమిటీ సమావేశాలను నిర్వహించాలని సూచించారు. ఎస్సీ స్మశాన వాటికలకు సంబంధించి ఆయా మండలాలలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించాలని, చుక్కల భూముల నివేదికలను కూడా నిబంధన మేరకు రూపొందించాలని కలెక్టర్ సూచించారు.

పట్టాభిరామయ్య బ్రహ్మోత్సవాలకు నేడు అంకురార్పణ


బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న ఆలయం


చలువపందిళ్లు ఏర్పాటు చేసిన దృశ్యం

వాల్మీకిపురం: పట్టణంలోని శ్రీ పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలకు ఆదివారం సాయంత్రం ఆలయంలో అంకురార్పణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి క్రిష్ణమూర్తి తెలిపారు. సోమవారం నుంచి వాహన సేవలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో చలువపందిళ్ల, విద్యుత్ దీపాలంకరణలు, రంగవల్లికలతో ముస్తాబు చేశారు. శ్రీ పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలకు టీటీడీ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాట్లు ముమ్మరం చేశారు. పట్టణంలోని జాతీయ రహదారికి ఇరువైపులా స్వాగత తోరణాలు, విద్యుత్ దీపాలతో దేవతామూర్తుల ప్రతిమలను ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, తదితర ఏర్పాట్లు చేపట్టారు. ఆలయంలో రంగురంగుల విద్యుత్ దీపాలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

పులివెందుల మోడల్‌టౌన్ పనులు త్వరగా పూర్తి చేయాలి

పులివెందుల రూరల్ : పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని రాష్ట్ర ప్లానింగ్ సెక్రటరీ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. వీటిని త్వరగా పూర్తి చేయాలన్నారు. శనివారం పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మోడల్ టౌన్‌లో భాగంగా సిటీ సెంటర్, నగర వనం, నీటి ట్యాంక్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. అనంతరం మోడల్ టౌన్‌కు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లె: వేంపల్లెను మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ప్లానింగ్ సెక్రటరీ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం వేంపల్లెలోని పలు సర్కిళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పులివెందుల తరహాలో వేంపల్లె పట్టణంలోని సర్కిళ్లను డెవెలప్‌మెంట్ చేయాలన్నారు. జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

సమయపాలన, సమన్వయంతోనే సుస్థిర అభివృద్ధి


మాట్లాడుతున్న రాష్ట్ర ప్లానింగ్ కార్యదర్శి విజయ్‌కుమార్. చిత్రంలో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు విజయరామరాజు, గిరీషా

రాష్ట్ర ప్లానింగ్ కార్యదర్శి విజయ్‌కుమార్

కడప సిటీ : సమయపాలన, సమన్వయంతో పనిచేస్తే సుస్థిర అభివృద్ధిలో మిలీనియం లక్ష్యాన్ని చేరుకోవచ్చని రాష్ట్ర ప్లానింగ్ కార్యదర్శి జీఎస్‌ఆర్‌కేఆర్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. 2016-30 మిలినియం సమీకృత అభివృద్ధికి, అభివృద్ధి లక్ష్యాల సాధనకు ప్రపంచ వ్యాప్తంగా 8 అంశాలు, 18 లక్ష్యాలు, 56 సూచికలతో ప్రణాళిక సిద్ధం చేసినట్లు చెప్పారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సభా భవనంలో రాష్ట్ర ప్రణాళికశాఖ ఆధ్వర్యంలో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, క్షేత్ర స్థాయి అధికారులతో సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (ఎస్‌డీజీ-సుస్థిర అభివృద్ధి లక్ష్యం), స్పందన అర్జీల పరిష్కారాలపై ఓరియంటేషన్ సమీక్షా సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్లానింగ్ కార్యదర్శి విజయ్‌కుమార్ హాజరయ్యారు. వైఎస్సార్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ అన్బురాజన్, కడప నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్‌మీనా, అన్నమయ్య జిల్లా నుంచి కలెక్టర్ పీఎస్ గిరీషా, రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఎఫ్‌ఓ వివేక్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రణాళికశాఖ కార్యదర్శి విజయ్‌కుమార్ మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి రాష్ట్ర ప్రభుత్వం 17 అంశాలను, పలు సూచికలను నిర్దేశించిందన్నారు. సమష్టి కృషి ద్వారా పరస్పరం చర్చించుకోవడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించడం, వాటిని పరిష్కరించడం వంటి చర్యలు దశాబ్దాల కాలంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమమే అయినా దీనిని మరింత ప్రాధాన్యతతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోందన్నారు. వైఎస్సార్ జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్, ఆర్డీఓలు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, వెంకటరమణ, రెండు జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

సివిల్ తగాదాలు ఎక్కువగా వస్తున్నాయి

ప్రతివారం వచ్చే అర్జీల్లో రెవెన్యూశాఖకు సివిల్ తగాదాలకు చెందినవే అధికంగా నమోదవుతున్నట్లు వైఎస్సార్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. ఎస్‌డీజీ లక్ష్యాలను, స్పందన అర్జీల పరిష్కారానికి అవసరమైన సూచనలు చేసే విధానంలో ఈ సమీక్షా సమావేశం ఒక ప్రాధాన్యత కలిగి ఉందన్నారు. మండల స్థాయిలోనూ స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మూలం తెలుసుకుని పరిష్కారించడమే ముఖ్యం

స్పందన అర్జీల పరిష్కార విషయంలో సమస్య మూలం తెలుసుకుని పరిష్కారం చేయడం ముఖ్యమని అన్నమయ్య జిల్లా కలెక్టర్ పీఎస్ గిరీషా పేర్కొన్నారు. సుస్థిర అభివృద్ధి, లక్ష్యాల సాధనకు విభిన్న ఆలోచనలు ఉంటాయన్నారు. సమస్యను గుర్తించి పరిష్కారం కోసం దృష్టి పెడితే తప్పక మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు.

బావిలో పడి మహిళ మృతి



పల్లవి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు, బంధువులు

గుర్రంకొండ : మండలంలోని మర్రిపాడు గ్రామంలో బావిలో పడి వివాహిత మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. మర్రిపాడుకు చెందిన బారు మల్లికార్జునకు పీలేరు మండలం ముడుపుల వేముల గ్రామానికి చెందిన పల్లవి(42)తో 14 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. వీరు గొర్రెలు కాచుకొంటూ జీవనం సాగిస్తున్నారు. కొంత కాలంగా పల్లవినే గొర్రెలు కాయడానికి వెళుతోంది. ఆమె ఇటీవల అనారోగ్యానికి గురై బాధపడుతోంది. శుక్రవారం నుంచి ఇంట్లో కనిపించకపోయే సరికి కుటుంబ సభ్యులు అన్ని చోట్లా గాలించారు. ఆదివారం ఉదయం స్థానిక జెడ్పీహైస్కూల్ వెనుక పొలాల్లోని ఓ బావిలో శవమై తేలింది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

రాజంపేట : రాజంపేట రైల్వేస్టేషన్‌లో శనివారం పట్టణంలోని నాగులమానువీధికి చెందిన షఫీ (53) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. జీవనోపాధి కోసం కువైట్ వెళ్లి వచ్చాడు. ఏడాది నుంచి ఇంటి వద్ద ఉంటున్నాడు. రైలు వెళ్లిపోయిన తర్వాత మృతదేహాన్ని గుర్తించారు. రేణిగుంట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోజ్ దారో ఉఠో.. సహరీ కర్లో..

- రంజాన్ మాసంలో వేకువజామున మేల్కొలుపు
- పవిత్ర పుణ్యకార్యంగా భావిస్తున్న ఫకీర్లు



గురువు సయ్యద్ సిద్దీఖుల్లాషాతో ఫకీర్లు

మదనపల్లె సిటీ : 'అయ్ రోజ్ దారో ఉఠో... సెహరీ కా వక్త్ హువా హై.. సహరీ కర్లో...' ఈ పిలుపు రంజాన్ మాసంలో సర్వసాధారణంగా వినిపిస్తుంటుంది. రంజాన్ నెల ప్రారంభమవ్వగానే... ఉపవాస దీక్షకు ముస్లింలను మేల్కొలిపి సిద్ధం చేయడం ఫకీర్లకు ఆనవాయితీగా వస్తోంది. ఇలా ఉపవాస దీక్షకు ఉపక్రమించే వారిని మేల్కొల్పడం పవిత్రకార్యంగా భావించి స్వచ్ఛందంగా సేవ చేస్తుంటారు ఫకీర్లు. ఇలా నెలంతా ఉపవాస దీక్షాపరులైన ముస్లింలను మేల్కొల్పినందుకు పండుగ రోజున సంతోషంగా వారిచ్చే కొద్దో.. గొప్పో కానుకలను స్వీకరించి, సంతృప్తి చెందుతారు. దశాబ్దాలుగా ఈ వృత్తిని స్వచ్ఛందంగా... సంతృప్తిగా అల్లాపై భక్తితో చేస్తున్నామని ఫకీర్లు చెబుతున్నారు.

రంజాన్ మాసంలో ముస్లింలు నివసించే వీధులు వేకువజామున ఫకీర్ల మేల్కొలుపుతో మార్మోగుతాయి. ఉపవాసదీక్షలలో భాగంగా వేకువజామున 4 గంటల ప్రాంతంలో వీధులలో డప్పు (దఫ్) వాయిస్తూ 'సహరీ'కి మేల్కొలుపుతారు. అప్పట్లో విద్యుత్‌దీపాలు లేకపోవడంతో లాంతర్లు పట్టుకుని వీధుల్లో తిరిగేవారు. చేతిలో డప్పుని వాయించుకుంటూ తమ మధురమైన స్వరంతో అల్లాను స్మరిస్తూ భక్తితో పాటల రూపంలో పాడుతూ వీధి వీధినా తిరుగుతారు. రాత్రి ఇషా నమాజు చదివి 11 గంటల సమయంలో పడుకున్నా తెల్లవారుజామున మూడు గంటలకు లేస్తారు. పవిత్ర రంజాన్ చంద్ర(నెలవంక) దర్శనం మొదలుకుని చివరి రోజా వరకు రోజూ ఇలా చేస్తారు. మదనపల్లె పట్టణం బడేమకాన్ దర్గాలో ఫకీర్లు దాదాపు 11 మంది ఉన్నారు. గురువు సయ్యద్ సిద్దీఖుల్లాషాతోపాటు పది మంది శిష్యులు ముస్లిం ప్రాంతాలను ఎంపిక చేసుకుని, సహరీ కోసం నిద్ర లేపుతారు.

రెండు గంటల పాటు

తెల్లవారుజామున 2.30 గంటల నుంచి 4.30 వరకు రెండు గంటల పాటు ముస్లింలు నివసించే ఆయా ప్రాంతాల్లో ఫకీర్లు దఫ్‌తో నిద్రలేపుతారు.

అలర్ట్ కోసం

గతంలో గడియారం, అలారమ్, సైరన్ మోతలు అందుబాటులో లేకపోవడంతో ఫకీర్ల ప్రాధాన్యత ఎంతో ఉండేది. ఫకీర్లు పొరపాటున చాటింపు వేయకపోతే అక్కడివారు సకాలంలో మేల్కొనకపోవడం వల్ల ఆ రోజు ఉపవాసదీక్షలు వదిలేయాల్సి వచ్చేది. ఫకీర్లు కాలినడకతోపాటు సైకిల్‌పై డప్పు వాయిస్తూ దఫ్ కొడుతూ డబ్బా వాయిస్తూ ముస్లింలను నిద్రలేపుతారు. అలాగే మసీదులలో మైక్‌ల ద్వారా తెల్లవారుజామున 3 గంటల నుంచి.. సహరీకి మేల్కొలుపుతారు. మసీదు పరిసర ప్రాంతాల్లో ఈ విధానం కొనసాగుతోంది. దూర ప్రాంతాల్లో ఫకీర్లు చాటింపు వేస్తారు.

సంతృప్తిగా నిర్వహిస్తున్నాం

వారసత్వంగా వచ్చిన ఈ పనిని మేము సంతోషంగా నిర్వహిస్తున్నాం. దాదాపు 50 ఏళ్లకు పైగా రంజాన్ మాసంలో సహరీ కోసం ఉపవాసదీక్షపరులను మేల్కొలుపుతున్నా. ఇది మాకు పుణ్యం ప్రసాదిస్తుందని భావిస్తున్నా. మా చాటింపుల కారణంగానే ఎంతో మంది నిద్రలేచి ఉపవాసదీక్షలను పాటిస్తుండటం ఎంతో సంతృప్తి కలుగుతుంది. ముస్లింలు రంజాన్ రోజు ఇచ్చే కానుకలు తీసుకుంటా. అల్లాహ్ పై ఉన్న భక్తితోనే మేము ఈ పని చేస్తున్నాం.

– సయ్యద్ సిద్దీఖుల్లా, ఫకీర్ల గురువు, మదనపల్లె

నేను బాల్యం నుంచి చూస్తున్నా..

రంజాన్ మాసంలో చేపట్టే ఉపవాసదీక్షలో సహరీ (వేకువజామున 4 గంటలకు తీసుకునే ఆహారం) తప్పనిసరి. అయితే రాత్రిళ్లు చాలా సేపు ప్రార్థనల్లో గడిపి నిద్రపోయాక సహరీ కోసం వేకువజామున 4 గంటలకు నిద్ర నుంచి లేవకపోతే మరుసటి రోజు ఉపవాసం జరగదు. దీంతో సహరీకి ఫకీర్లు వీధుల్లో వచ్చి తమ మధురమైన గానంతో మేల్కొలుపుతుంటారు. ఇందులో భాగంగా మా ప్రాంతానికి వచ్చే ఫకీర్ సిద్దిక్‌ఉల్లాషాను నేను నా బాల్యం నుంచి చూస్తున్నాను.

– పి.మహమ్మద్‌ఖాన్, మోతీనగర్, మదనపల్లె.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి



జ్యోత్స్న (ఫైల్)

సిద్దవటం : మండల పరిధి మాధవరం-1 గ్రామ శివారులోని ఇండేన్ గ్యాస్ గోడౌన్ సమీపాన పాడుపడ్డ బావిలో రాటాల జ్యోత్స్న (31) అనే వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందినదని ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. సిద్దవటం మండలంలోని ఉప్పరపల్లె గ్రామానికి చెందిన రాటాల జ్యోత్స్న కనిపించడం లేదని ఫిబ్రవరి 11న ఆమె మేనమామ చంద్రమౌళి సిద్దవటం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మహిళ అదృశ్యం కేసు ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్ నమోదు చేశారు. శనివారం మాధవరం-1 గ్రామ శివారులోని ఇండేన్ గ్యాస్ గోడౌన్ సమీపంలోని పాడుబడ్డ బావిలో శవమై కనిపించింది. మృతదేహాన్ని క్రేన్ సాయంతో వెలికి తీశారు. అక్కడే రిమ్స్ ఆసుపత్రి వైద్యుడు అనుదీప్ పోస్టుమార్టం నిర్వహించారు. మూడు వారాల కిందట మృతి చెందినట్లు ఉందని, మృతదేహం పూర్తిగా దెబ్బతిని దుర్వాసన వస్తోందని సీఐ తెలిపారు. అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్, పోలీసులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



మృతి చెందిన రైతు హరినాథరెడ్డి

మదనపల్లె : వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీర్చలేక రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం పుంగనూరు మండలంలో జరిగింది. మండలంలోని ఏతూరు గ్రామానికి చెందిన హరినాథరెడ్డి(47) పొలంలో పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నిస్తే గమనించిన కుటుంబ సభ్యులు పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ హరినాథరెడ్డి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు సూచించడంతో మెరుగైన వైద్యచికిత్సల కోసం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్సలు అందించినప్పటికీ పురుగుమందు విషం శరీరం మొత్తం వ్యాపించడంతో శుక్రవారం రాత్రి హరినాథరెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో మరణించారు. భార్య గంగులమ్మ ఫిర్యాదు మేరకు హరినాథరెడ్డి ఆత్మహత్యపై కేసు నమోదు చేసినట్లు పుంగనూరు పోలీసులు తెలిపారు.

నీట మునిగి ఎద్దులు మృతి



మృతి చెందిన కాడెద్దులు

గాలివీడు : మండల పరిధిలోని వైఎస్సార్ వెలిగల్లు గ్రామం వద్ద రెండు ఎద్దులు నీట మునిగి మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. వెలిగల్లు గ్రామానికి చెందిన రైతు మాబు తమ వ్యవసాయం పొలం వద్దకు రోజు వలే కాడి ఎద్దులతో పోతూ వస్తుండేవాడు. ఈ క్రమంలో శనివారం కూడా తమ వ్యవసాయ భూముల వద్దకు పోవుటకు పాతవెలిగల్లు దగ్గర వెలిగల్లు నీరు రోడ్డుకు పూర్తి స్థాయిలో రావడంతో.. అది గమనించని రైతు ఎద్దులు లోతట్టు ప్రాంతానికి వెళ్లడంతో నీట మునిగి అక్కడికక్కడే మృతి చెందాయి. రైతు క్షేమంగా బయటపడ్డాడు. ఎద్దులు మృతి చెందడంతో రైతు కన్నీరుమున్నీరయ్యాడు. ప్రభుత్వం రైతును ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఎద్దుల విలువ దాదాపు రూ. 1.50 లక్షలు విలువ ఉంటుందని అంచనా.

ఎమ్మెల్యే చింతల సోదరుడు మృతి





చరణ్‌కుమార్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం : పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సోదరుడు విశ్రాంత సెంట్రల్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చింతల చరణ్‌కుమార్‌రెడ్డి(62) అనారోగ్యంతో మృతి చెందాడు. పట్టణంలోని ఎల్‌ఆర్ వీధిలోని చరణ్‌కుమార్‌రెడ్డి స్వగృహానికి ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి శనివారం చేరుకొని, మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఎల్‌ఆర్‌వీధికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నిర్మల పార్థసారథి ఆకస్మికంగా మృతి చెందాడు. మృతుడి స్వగృహానికి ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట చింతల శ్రీధర్‌రెడ్డి, చింతల ఆనందరెడ్డి, చింతల శివానందరెడ్డి, కేశవ రెడ్డి, నీళ్లభాస్కర్, శ్రీధర్‌రాయల్, పట్టణ ప్రముఖులు ఉన్నారు.

'స్కిల్'తో రూ.371 కోట్లు స్కాం చేసిన టీడీపీ

ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు



రైల్వేకోడూరు : టీడీపీ హయాంలో నైపుణ్య శిక్షణ పేరుతో చంద్రబాబు 371 కోట్లు స్కాం చేశారని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు ఆరోపించారు. రైల్వేకోడూరులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశ చరిత్రలో నిరుద్యోగులను మోసం చేసిన అతి పెద్ద స్కామ్ ఇది అన్నారు. షెల్ కంపెనీల ద్వారా రూ.371 కోట్లు చంద్రబాబుకు చేరినట్టు బలమైన ఆరోపణలున్నాయన్నారు. స్కిల్ స్కామ్‌లో నిధుల విడుదలపై ఆనాడే కొందరు ఆర్థికశాఖ అధికారులు ఆందోళనకు దిగినా పట్టించుకోకుండా వెంటనే డబ్బులు విడుదల చేయాలని నోట్‌ఫైల్‌లో చంద్రబాబు అప్పటి ప్రిన్సిపల్ ఫైనాన్స్ సెక్రటరీని ఆదేశించారన్నారు. చంద్రబాబు చెప్పినట్టే నేరుగా నిధులు విడుదల చేసినట్టు మరో నోట్‌ఫైల్‌లో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రాశారన్నారు. ఆ జీవోలు, ఎంఓయూలతో తమకు ఎలాంటి సంబంధం లేదని కోర్టుకు వెల్లడించారు. కనీసం దానికి డీపీఆర్ కూడా లేదని, నిబంధనలను కూడా ఉల్లంఘించారని తెలిపారు. ప్రాజెక్టుకు సంబంధించి నోట్ ఫైల్స్‌ను కూడా మాయం చేశారన్నారు. ఈ స్కామ్ 2017లోనే బయటపడినా చంద్రబాబు ప్రభుత్వం స్పందించలేదన్నారు. నాడు టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు బటన్ నొక్కగానే ప్రభుత్వ ఖాతా నుంచి అటూ ఇటు తిరిగి ఆయన ఖాతాలోకి డబ్బులు వచ్చేవని, ఇదే బాబు అవినీతి విజన్ అన్నారు. ఈ కేసులో ఇప్పటికే నలుగురిని ఈడీ అరెస్ట్ చేసిందన్నారు.

రామయ్య క్షేత్రంలో భక్తులపై తేనెటీగల దాడి

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో శనివారం తేనెటీగలు 15 మందిపై దాడి చేశాయి. బ్రహ్మోత్సవాల పనుల ఏర్పాట్ల సందర్భంగా ఆలయంలో కూలీలు పని చేస్తుండగా పొరపాటున తేనెపట్టును కదిలీయడంతో.. అవి చెలరేగి ఆలయంలోని భక్తులపై దాడి చేసినట్టు ఆలయ విజిలెన్స్ అధికారి గంగులయ్య తెలిపారు. విషయం తెలుసుకున్న ఆలయ సిబ్బంది అప్రమత్తం అయ్యి బాధితులను స్థానిక పీహెచ్‌సీకి తరలించారు.

పశుసంవర్ధక శాఖ
డీడీ అచ్చెన్న మృతిపై వీడని మిస్టరీ

- పలు కోణాల్లో ఉమ్మడి జిల్లాల పోలీసుల దర్యాప్తు
- సెల్‌ఫోన్ కాల్ డేటా ఆధారంగా లోతుగా విచారణ
- పోస్టుమార్టం నివేదిక ద్వారా హత్యా? ఆత్మహత్యా?నా తేల్చనున్న వైనం



మాట్లాడుతున్న అన్నమయ్య జిల్లా డీఎస్పీ శ్రీధర్

కడప అర్బన్ : కడపలోని పశుసంవర్ధక శాఖలో డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేస్తూ గువ్వల చెరువు ఘాట్‌లో శవమై తేలిన అచ్చెన్న సంఘటనపై ఉమ్మడి జిల్లాల పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేపట్టారు. పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఒక వైపు కడప ఒన్‌టౌన్ పోలీసుల బృందం, మరోవైపు అన్నమయ్య జిల్లా రామాపురం పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ నెల 12న తన ఇంటి నుంచి వెళ్లిన అచ్చెన్న చర్చికి వెళ్లి, తరువాత ఆఫీసుకు వెళ్లి వస్తానని ఇంటిలో చెప్పి వెళ్లినట్లు అతని కుమారుడు డాక్టర్ క్లింటన్ చక్రవర్తి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ తరువాత సెల్‌ఫోన్ స్విచాఫ్ వచ్చిన సమయం నుంచి పోలీసులు ఆరా తీశారు. సీసీ కెమెరాల ఫుటేజీలను కడప నుంచి రామాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో గువ్వల చెరువు ఘాట్ రోడ్డు వరకు క్షుణ్ణంగా పరిశీలన చేస్తున్నారు. అలాగే ఆయన సెల్‌ఫోన్‌కు వచ్చిన కాల్స్ డేటాపై కూడా ఆరా తీస్తున్నారు. ఆయన మృతదేహం ఈనెల 24న గువ్వల చెరువు ఘాట్‌లో లభ్యమైనపుడు కుటుంబ సభ్యులను పిలిపించి నిర్ధారణ చేసిన తరువాత డాక్టర్లు వచ్చి సంఘటన స్థలంలోనే పోస్టుమార్టం చేయించారు. తరువాత ఆయన మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. వారు కర్నూలు జిల్లాకు ఆయన మృతదేహాన్ని తీసుకుని వెళ్లి అంత్యక్రియలను పూర్తి చేశారు. ఆయన మరణం సాధారణమైనదా? లేక ఆత్మహత్యనా? లేక హత్యకు గురయ్యాడా? అనే ప్రాథమిక విషయాలపై పోస్టుమార్టం నివేదిక రావాల్సిందేనని పోలీసులు, అధికారులు తెలియజేస్తున్నారు. అనారోగ్యంగా వుండి చనిపోతే సాధారణ మరణమని భావిస్తున్నారు. ఏది ఏమైనా అచ్చెన్న మరణానికి గల కారణంపై ఇంకా అధికారులు ఓ కొలిక్కి రాలేదని తెలుస్తోంది.

డీడీ అచ్చెన్న మృతిపై సమగ్ర విచారణ
– అన్నమయ్య జిల్లా డీఎస్పీ శ్రీధర్

రామాపురం : కడప పశుసంవర్ధక శాఖలోని వెటర్నరీ పాలీక్లినిక్(వీపీసీ) డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అచ్చెన్న మృతిపై అన్నమయ్య జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు సమగ్ర విచారణ చేపడుతామని డీఎస్పీ శ్రీధర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిలోని రామాపురం మండలం గువ్వలచెరువు ఘాట్ రోడ్డులోని కోనేటి బండల సమీపంలో శుక్రవారం అచ్చెన్న(58) మృతదేహాన్ని గుర్తించామని పేర్కొన్నారు. ఆ గ్రామం వీఆర్‌ఓ కల్లూరు ఫాతిమాబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మృతుడి వద్ద గల ఆనవాల మేరకు కుటుంబీకులకు సమాచారం అందించామన్నారు. లక్కిరెడ్డిపల్లె సీఐ వరప్రసాద్, రామాపురం ఎస్‌ఐ కొండారెడ్డిలు సంఘటన స్థలానికి వైద్యులను పిలిపించి మృతదేహానికి పోస్టుమార్టం చేయించారన్నారు. మృతదేహాన్ని కుటుంబీకులకు శుక్రవారం రాత్రి అప్పగించామని వివరించారు. పశుసంవర్ధక శాఖలో డిప్యూటీ డైరెక్టర్‌గా అచ్చెన్న విధులు నిర్వహిస్తున్న సమయంలో సస్పెండ్‌కు గురయ్యారని పేర్కొన్నారు. ఆ నోటీసులు తీసుకొన్నప్పటి నుంచి మనస్తాపానికి గురైనట్లు సమాచారం ఉందన్నారు. కుటుంబీకులను, ఆ శాఖ అధికారులను విచారణ చేస్తామన్నారు. తనంతకు తానే చనిపోయాడా, ఇతర కారణాలు ఉన్నాయా అనే విషయంపై సమగ్రంగా విచారణ చేపడుతున్నట్లు ఆయన వివరించారు.

మాకు ఎలాంటి సంబంధం లేదు

– జిల్లా పశుసంవర్ధశాఖ అధికారి డాక్టర్ శారదమ్మ

కడప అగ్రికల్చర్ : జిల్లా బహుళార్థ పశువైద్యశాలలో డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేస్తున్న అచ్చెన్న అదృశ్యం, మృతిపై మాకు ఎటువంటి సంబంధం లేదని జిల్లా పశుసంవర్ధశాఖ అధికారి డాక్టర్ శారదమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ అచ్చెన్న విడతల వారీగా ఇద్దరు అసిస్టెంట్ డైరెక్టర్లు, ఒక డాక్టర్, ఇద్దరు కింద స్థాయి సిబ్బందిని నిబంధనలకు విరుద్ధంగా సరెండర్ చేస్తూ వారి జీతాలను నిలిపి వేసి సిబ్బందిని వేధించారని ఆమె పేర్కొన్నారు. ఏపీఎఫ్‌ఆర్‌ఎస్ యాప్ నుంచి సిబ్బంది పేర్లను కూడా నిబంధనలకు వ్యతిరేకంగా తొలగించారన్నారు. ఈ విషయమై ప్రభుత్వం నియమించిన నిజ నిర్ధారణ కమిటీ రిపోర్టు మేరకు ఈ నెల 15న అచ్చెన్నను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు అందాయన్నారు. అంతకు ముందు మార్చి 12న డాక్టర్ అచ్చెన్న తన కుమార్తెతో చర్చిలో కలిసి తర్వాత కనిపించడం లేదని ఆయన కుమారుడు కడప వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. కావున ఆయన అదృశ్యంపై, మృతిపై మాకు ఎటువంటి సంబంధం లేదని ఆమె తెలిపారు.

డీడీ అచ్చెన్న మృతి బాధాకరం
– వెటర్నరీ అసోసియేషన్

పశుసంవర్ధక శాఖ డీడీ అచ్చెన్న మృతి బాధాకరమని వెట్నరరీ అసిస్టెంట్ సర్జన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శివరామిరెడ్డి, అనిమెల్ హజ్బెండరీ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నేతాజీ పేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఉద్యోగులను సరెండర్ చేయడం, 6 నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో అసోసియేషన్ ద్వారా పశుసంవర్ధకశాఖ డైరెక్టర్‌కు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని వివరించారు.

- డీడీ అచ్చెన్న మృతిపై సమగ్ర విచారణ జరపాలని నేషనల్ హ్యూమన్ రైట్ ప్రొటెక్షన్ ఫోరం కడప జిల్లా అధ్యక్షుడు నరసింహులు డిమాండ్ చేశారు.